రైల్వే భద్రతపై డీజీపీ సమీక్ష

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని రైల్వే ప్రాంతాల భద్రత పరిస్థితులపై డీజీపీ రవి గుప్తా సమీక్షించారు. రైల్వేస్, రోడ్ సేఫ్టీ అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ ఆధ్వర్యంలో రైల్వే పోలీస్, రైల్వే అధికారులతో సోమవారం డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో.. రైల్వే పోలీస్‌కు అవసరమైన మరికొంత మంది సిబ్బందిని కేటాయించే విషయంపై చర్చిస్తానని డీజీపీ తెలిపారు. రైల్వే ట్రాక్‌లపై జరుగుతున్న ప్రమాదాలపై విచారణ చేపట్టాలని రైల్వే పోలీసులకు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే డయల్ 100, 139, 1512కు సమాచారం ఇవ్వాలని ప్రయాణికులకు సూచించారు. మొబైల్ ఫోన్లు చోరీకి గురైతే, సమీప రైల్వేస్టేషన్లలో, www.ceir.gov.in కు ఫిర్యాదు చేయాలని వెల్లడించారు.

నటుడు వెంకటేశ్‌పై కేసు

- అక్రమంగా హోటల్ కూల్చారని ఫిర్యాదు
- జూలై 17కు వాయిదా వేసిన న్యాయస్థానం

నాంపల్లి కోర్టులు, జనవరి 29 (నమస్తే తెలంగాణ): సినీ నిర్మాత దగ్గుపాటి సురేశ్‌బాబు, హీరో వెంకటేశ్, రానా, అభిరామ్, గడ్డం విశ్వనాథానికి వ్యతిరేకంగా కోర్టులో ప్రైవేటు పిటిషన్ దాఖలైంది. సాక్ష్యాధారాలను పరిశీలించిన అనంతరం 17వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ సాయిసుధ వారిపై కేసు నమోదు చేయాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. దగ్గుపాటి కుటుంబీకులకు సమన్లు జారీ చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను జూలై 17త తేదీకి వాయిదా వేసింది. ఫిర్యాదుదారుడు నందకుమార్‌కు చెందిన దక్కన్ హోటల్‌ను అక్రమంగా కూల్చివేశారని, కోర్టు ఆదేశాలను సైతం తుంగలో తొక్కారని న్యాయవాది కోర్టుకు వివరించారు.

సీఎం రావాలి.. న్యాయం చేయాలి

317 జీవోను సమీక్షించాలి

- కాంగ్రెస్ ఎన్నికల హామీని అమలు చేయాలి
- సచివాలయం వద్ద ధర్నాలో స్టాఫ్ నర్సులు
- లోపల సీఎం మీటింగ్.. బయట హోరెత్తిన నినాదాలు

సోమవారం సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న స్టాఫ్ నర్సులు. కంటతడి పెడుతున్న నర్సు (ఇన్‌సెట్)

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): సీఎం రావాలి.. న్యాయం చేయాలి.. అంటూ రాష్ట్ర సచివాలయం ఎదుట నినాదాలు చేస్తూ సోమవారం స్టాఫ్ నర్సులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం 317 జీవోను సమీక్షించాలి, హైకోర్టు తీర్పును అమలు చేయాలి, సీఎం రావాలి.. న్యాయం చేయాలి.. అన్న నినాదాలు ఆ ప్రాంతంలో హోరెత్తాయి. తాము సొంత జిల్లాలకు వెళ్లడానికి ఒక్కరోజు మాత్రమే సమయం ఉన్నది. ఆలోగా మాకు న్యాయం చేసి జీవితాలను నిలబెట్టండి.. అంటూ వేడుకున్నారు. 317 జీవోను సమీక్షిస్తామని, బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన మేరకు తమ సమస్యలను పరిష్కరించాలంటూ 317 జీవో ప్రభావిత స్టాఫ్ నర్సులు ధర్నా చేపట్టారు. ఆ సమయంలో సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి వైద్యారోగ్య శాఖపై సమీక్ష నిర్వహిస్తున్నారు. ఇదే సమయంలో బయట బాధితులు బైఠాయించడంతో గందరగోళం నెలకొన్నది. వారి ధర్నాతో సుమారు గంటసేపు సచివాలయం వద్ద గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

ఆఖరి అవకాశం.. న్యాయం చేయండి

రాష్ట్ర ప్రభుత్వం 7,094 స్టాఫ్ నర్స్ పోస్టులకు బుధవారం నియామకపత్రాలు అందజేయనున్నది. ఈ నేపథ్యంలో బాధితులు సోమవారం సచివాలయానికి తరలివచ్చి నిరసనకు దిగారు. 'మేము సొంత జిల్లాలకు వెళ్లాలంటే ఇంకా ఒక్కరోజు మాత్రమే మిగిలి ఉన్నది. బుధవారం నియామకపత్రాలు ఇస్తే మా జిల్లాల్లోని ఖాళీలన్నీ భర్తీ అవుతాయి. అప్పుడు మాకు అవకాశం ఉండదు. మా కోసం సూపర్ న్యూమరరీ పోస్టులను సృష్టించే అవకాశమూ ఉండదు. మాకు ఇదే చివరి అవకాశం. ప్రభుత్వమే న్యాయం చేయాలి' అని బాధితులు ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఇప్పటికే డీపీహెచ్ కార్యాలయం ఎదుట ధర్నా చేశామని, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం అందజేశామని.. అయినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయారు. ఈ సందర్భంగా పోలీసులు సర్దిచెప్పినా ఆందోళనకారులు వినలేదు. తాము సీఎం రేవంత్‌రెడ్డిని కలిసే అవకాశం ఇవ్వాలని, లేదా సీఎంనే ఇక్కడికి రప్పించాలని వారు కోరారు. చివరికి ఐదుగురు సభ్యులను సీఎం వద్దకు తీసుకెళ్తామన్న పోలీసుల హామీతో ఆందోళనకారులు ధర్నా విరమించారు.

సుమారు 400 మంది స్టాఫ్‌నర్సులకు ఇక్కట్లు

కొత్త జోనల్ విధానం అమలులో భాగంగా ఉద్యోగుల విభజనకు గత ప్రభుత్వం '317 జీవో'ను విడుదల చేసింది. ఈ మేరకు అనేక మంది పట్టణాల నుంచి పల్లెలకు, ఇతర జిల్లాలకు వెళ్లిపోయారు. ముఖ్యంగా హైదరాబాద్‌లో స్థిరపడిన కొందరు జిల్లాలకు బదిలీ అయ్యారు. తమకు సొంత ప్రాంతంలో కాకుండా ఇతర జోన్‌లో పోస్టింగ్ ఇచ్చారని సుమారు 400 మంది స్టాఫ్‌నర్సులు గతంలోనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దూర ప్రాంతాల్లో పోస్టింగ్ ఇవ్వడంతో కుటుంబాలకు దూరంగా ఉండాల్సి వస్తున్నదని, తిరిగి పాత స్థానాలకు పంపించాలని కోరారు. హైకోర్టును సైతం ఆశ్రయించామని, తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని బాధితులు చెప్తున్నారు. మరోవైపు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో '317 జీవోను సమీక్షిస్తాం' అని హామీ ఇచ్చింది.

కొవిడ్ సమయంలో పుణ్యానికి పనిచేశారా?

నర్సింగ్ అభ్యర్థులపై వైద్యశాఖమంత్రి రాజనర్సింహ ఆగ్రహం

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): కొవిడ్ సమయంలో పనిచేసిన తమకు స్టాఫ్‌నర్స్ నియామకాల్లో వెయిటేజీ ఇవ్వాలని కోరినందుకు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆగ్రహం వ్యక్తంచేశారని నర్సులు వాపోయారు. 'పుణ్యానికి చేశారా? జీతం తీసుకున్నారు కదా?' అని అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. కొవిడ్ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం రోగులకు చికిత్స అందించేందుకు టిమ్స్‌ను ప్రత్యేక దవాఖానగా మార్చింది. ఇందులో పనిచేసేందుకు నర్సులను తాత్కాలికంగా నియమించుకున్నది. తాము కొవిడ్ సమయంలో చేసిన సేవలకు గుర్తింపుగా స్టాఫ్‌నర్స్ పోస్టుల్లో 20 శాతం వెయిటేజీ ఇస్తామని గతంలో వైద్యారోగ్యశాఖ మంత్రిగా ఉన్న హరీశ్‌రావు హామీ ఇచ్చారు. తాజాగా 7,094 పోస్టులు భర్తీ చేస్తున్న నేపథ్యంలో తమకు ఇచ్చిన హామీని అమలుచేయాలని కోరుతూ పలువురు అభ్యర్థులు సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందించేందుకు ప్రయత్నించి, చివరికి సచివాలయంలో మంత్రి దామోదరను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'గత ప్రభుత్వ హామీతో తమకేం సంబంధమని, కొవిడ్ సమయంలో ఏమైనా పుణ్యానికి చేశారా? జీతాలు తీసుకొనే చేశారు కదా' అని వ్యాఖ్యానించారని బాధిత నర్సులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇది ఇండియానా? ఫారినా?

- హైదరాబాద్ అభివృద్ధి చూస్తుంటే ఆశ్చర్యమేస్తున్నది
- ఆలిండియా బిల్డర్స్ అసోసియేషన్ కన్వెన్షన్ చైర్మన్ రాధాకృష్ణ

హైదరాబాద్, జనవరి 29(నమస్తే తెలంగాణ): 'నేను ఎయిర్‌పోర్టు నుంచి వస్తుంటే.. హైదరాబాద్ అభివృద్ధిని చూసి ఇండియాలోనే ఉన్నానా? లేక ఏదైనా ఫారెన్ కంట్రీలో ఉన్నానా? అని ఆశ్చర్యం కలిగింది. రాష్ట్రాన్ని పాలించిన గత పాలకులకే ఈ ఘనత దక్కుతుంది. వారితోపాటు ఇంత అద్భుతమైన నిర్మాణాలు చేసిన కాంట్రాక్టర్లకు కూడా ఈ గౌరవం దక్కుతుంది' అని ఆలిండియా బిల్డర్స్ అసోసియేషన్ కన్వెన్షన్ చైర్మన్ రాధాకృష్ణ కొనియాడారు. హైటెక్స్‌లో నిర్వహించిన 31వ ఆలిండియా బిల్డర్స్ కన్వెన్షన్‌లో ఆయన మాట్లాడుతూ, 1989లో 13 ఆలిండియా బిల్డర్స్ కన్వెన్షన్‌ను హైదరాబాద్‌లో నిర్వహించగా, ఇప్పుడు 31వ కన్వెన్షన్‌ను ఇక్కడే నిర్వహించుకుంటున్నామని, ఈ మధ్యకాలంలో తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందిందని, రాష్ట్రాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించారని ప్రశంసించారు. తమ కన్వెన్షన్ కోసం హైదరాబాద్‌ను ఎంచుకోవడం ఎంతో సంతోషంగా ఉన్నదని వెల్లడించారు. దేశ తొలి ప్రధాని నెహ్రూ దేశాభివృద్ధికి పునాదులు వేయగా, పీవీ నరసింహారావు, మన్మోహన్‌సింగ్ సరళీకృత ఆర్థిక విధానాలతో దేశం పురోగమిస్తున్నదని, సూపర్ పవర్‌గా ఎదుగుతున్నదని పేర్కొన్నారు.

కేటీఆర్ చొరవతో హైదరాబాద్‌లో గుంతలు లేని రోడ్లు: శీనయ్య

కేసీఆర్ పాలనలో మున్సిపల్‌శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ చొరవతో నేడు హైదరాబాద్ రోడ్లు గుంతలు లేకుండా ఉన్నాయని ఆలిండియా బిల్డర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, కన్వెన్షన్ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ శీనయ్య ప్రశంసించారు. ఆలిండియా బిల్డర్స్ కన్వెన్షన్‌లో ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్‌లో రోడ్లు గుంతలు లేకుండా ఉండాలంటే తాము ఇచ్చే కొన్ని స్పెసిఫికేషన్స్ ప్రకారం రోడ్లను ఏర్పాటు చేయడంతోపాటు వాటి నిర్వహణ బాధ్యత కనీసం ఐదేండ్ల పాటు తమకు అప్పగించాలని కోరినట్టు చెప్పారు. దీనికి అప్పటి మంత్రి కేటీఆర్ వెంటనే ఒప్పుకొని, హైదరాబాద్‌లో రోడ్లపై గుంతలు లేకుండా చూడాలని స్పష్టంచేసినట్టు గుర్తుచేశారు. మరో పదేండ్ల పాటు హైదరాబాద్ రోడ్లను ముట్టుకోవాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. గతంలో ఏటా రోడ్ల మరమ్మతులకు రూ.200 కోట్లు ఖర్చుచేసేవారని, అయినా వర్షం పడగానే రోడ్లన్నీ కొట్టుకుపోయేవని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం కాంట్రాక్టర్ల సమస్యలు తెలుసుకునేందుకు ఓ వర్క్‌షాప్ నిర్వహించాలని కోరారు.

మాజీ మంత్రి పీ నర్సారెడ్డి కన్నుమూత

- నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం
- నిర్మల్ నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం
- నివాళి అర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క
- సంతాపం తెలిపిన మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

పి.నర్సారెడ్డి(ఫైల్)

నిర్మల్/ హైదరాబాద్, జనవరి 29(నమస్తే తెలంగాణ): నిర్మల్ జిల్లాకు చెందిన రాజకీయ దిగ్గజం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి పొద్దుటూరి నర్సారెడ్డి (92) అనారోగ్యంతో కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం ఉదయం హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం మలక్ చించోలి గ్రామంలో 1931 సెప్టెంబర్ 22న జన్మించిన నర్సారెడ్డి.. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బీఏ, ఎల్ ఎల్‌బీ పట్టాలు పొందారు. నిజాం నిరంకుశ పాలన నుంచి హైదరాబాద్ విముక్తి కోసం జరిగిన పోరాటంలో ఆయన చురుకుగా పాల్గొన్నారు. నిర్మల్ నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా, పీసీసీ అధ్యక్షుడిగా కొనసాగారు. ఆయన పార్థివదేహాన్ని జూబ్లీహిల్స్‌లోని నివాసంలో అభిమానులు, కార్యకర్తల సందర్శనార్థం ఉంచారు. నర్సారెడ్డి భౌతిక కాయానికి సీఎం రేవంత్‌రెడ్డి నివాళులు అర్పించారు. నర్సారెడ్డి మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి అనసూయ సీతక్క నర్సారెడ్డి భౌతిక కాయానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. మధ్యాహ్నం నర్సారెడ్డి భౌతికకాయాన్ని గాంధీభవన్‌కు తరలించగా, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు కోదండరెడ్డి, జీ నిరంజన్, నాగయ్య, కుమార్‌రావు, సాయికుమార్ తదితరులు నివాళులు అర్పించారు. అనంతరం జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో నర్సారెడ్డి అంత్యక్రియలు ముగిశాయి.

నర్సారెడ్డికి మీరిచ్చే గౌరవం ఇదేనా?: మాజీ మంత్రి అల్లోల

పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి పీ నర్సారెడ్డి అంత్యక్రియలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించకపోవడం శోచనీయమని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రజాసేవలో కొనసాగిన అజాత శత్రువు లాంటి నర్సారెడ్డికి కాంగ్రెస్ పార్టీ ఇచ్చే గౌరవం ఇదేనా అని అడిగారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించండి

- కేంద్రానికి మల్లు రవి విజ్ఞప్తి

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కేంద్ర హోంశాఖకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లు రవి విజ్ఞప్తి చేశారు. కేంద్ర హోంశాఖ అధికారులతో మల్లు రవి సోమవారం సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై వారితో చర్చించారు. అనంతరం వివరాలను మీడియాకు వెల్లడించారు. ఢిల్లీలోని ఏపీ, తెలంగాణభవన్ విభజన, ఆస్తుల పంపకానికి ఇరు రాష్ట్రాల అంగీకార పత్రాలను హోం శాఖ అధికారులకు ఇటీవలే రెండు రాష్ట్ర ప్రభుత్వాలు అందజేశాయని చెప్పారు.

పెండింగ్ పనులను పూర్తిచేస్తాం

ఏఐబీపీ ప్రాజెక్టులపై కేంద్రానికి ప్రభుత్వం విజ్ఞప్తి

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): పెండింగ్‌లో ఉన్న ఏఐబీపీ ప్రాజెక్టుల పనులను ప్రాధాన్యమిచ్చి ఈ ఏడాది పూర్తి చేస్తామని కేంద్రానికి రాష్ట్ర సాగునీటిపారుదల శాఖ అధికారులు వెల్లడించారు. అందుకు మరికొంత గడువు ఇవ్వడంతోపాటు పెండింగ్ నిధులను విడుదల చేయాలని కోరారు. సత్వర సాగునీటి ప్రయోజిత కార్యక్రమం (ఏఐబీపీ) కింద దేవాదుల, ఇందిరమ్మ వరద కాలువ, రాజీవ్‌భీమా, ఎస్సారెస్పీ స్టేజ్2, పాలెం, నీల్వాయి తదితర ప్రాజెక్టులు ఉన్న విషయం తెలిసిందే. ఆయా పనుల పురోగతిపై కేంద్ర జలశక్తిశాఖ చైర్మన్ కుశ్వంత్‌ఓరా నేతృత్వంలో ఢిల్లీలో సోమవారం ప్రత్యేక సమావేశం కొనసాగింది. ఈ సమావేశానికి చీఫ్ ఇంజినీర్ చంద్రశేఖర్ హాజరై ఆయా ప్రాజెక్టుల పురోగతిని వివరించారు. భూసేకరణ వల్లే ఆయా ప్రాజెక్టుల పనుల జాప్యానికి ప్రధాన కారణమని చెప్పారు. ఈ ఏడాది నీల్వాయి, పాలెం ప్రాజెక్టులను పూర్తి చేస్తామని కేంద్రానికి సీఈ వెల్లడించారు. అదేవిధంగా ఏఐబీపీ కింద దేవాదులకు రూ.100 కోట్లు, ఎస్సారెస్పీ స్టేజ్ 2కు రూ.9 కోట్లు, రాజీవ్‌భీమాకు రూ.30 కోట్లు, జగన్నాథపూర్ రూ.6 కోట్లు రావాల్సి ఉన్నదని, ఆ నిధులను విడుదల చేయాలని కోరారు. ప్రాజెక్టు పనులు పూర్తిచేసేందుకు ప్రణాళికలను సమర్పించాలని సూచించారు. సమావేశంలో కరీంనగర్ సీఈ శంకర్, వనపర్తి సీఈ, సీడబ్ల్యూసీ రీజినల్ డైరెక్టర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణపూర్ నుంచి నీళ్లొచ్చినయ్

మొదటిపేజీ తరువాయి...

పంటలు ఎడిపోతున్న వైనంపై నమస్తే తెలంగాణ ప్రచురించిన కథనం

అందక నారాయణపూర్ రిజర్వాయర్ ఆయకట్టు ఎండిపోతున్న తీరును 'నమస్తే తెలంగాణ' క్షేత్రస్థాయిలో పరిశీలించింది. గంగాధర మండలంలోని వెంకటాయపల్లి, కుర్మపల్లి, లక్ష్మీదేవిపల్లి తదితర గ్రామాల్లో పర్యటించి సాగునీటి కోసం రైతులు పడుతున్న కష్టాలను కళ్లకు కట్టినట్టు ప్రచురించింది. ఆదివారమే నీటిని విడుదల చేస్తున్నామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు. ఎండుతున్న పంట పొలాలు, బావుల్లో పూడిక తీసుకుంటున్న రైతులు, పంటలను రక్షించుకునేందుకు బావుల్లో సైడ్ బోర్లు వేసుకుంటున్న తీరుపై కథనం ప్రచురించడంతో నీటి పారుదల శాఖ అధికారులు ఆగమేఘాలపై సాగునీటిని విడుదల చేశారు.

ఒకే పంప్‌ద్వారా నీటి విడుదల

ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి రెండు పంప్‌ల ద్వారా నీటిని ఎత్తిపోసేందుకు అవకాశం ఉన్నా అధికారులు ఒకే పంప్ ద్వారా 210 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీని వల్ల రిజర్వాయర్ నిండేందుకు వారం రోజులు పట్టే అవకాశం ఉన్నది. అదే రెండు పంపుల ద్వారా విడుదల చేస్తే రెండుమూడు రోజుల్లోనే నిండి ఎండుతున్న పంటలకు నీళ్లివ్వవచ్చని చెప్తున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు పరిధిలో మొత్తం 1.50 లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా, నారాయణపూర్ రిజర్వాయర్ ఈ ప్రాజెక్టుకు కీలకంగా ఉంది. దీని ద్వారా కరీంనగర్ జిల్లా పరిధిలోని గంగాధర, చొప్పదండి, రామడుగు, జగిత్యాల జిల్లా పరిధిలోని కొడిమ్యాల, మల్యాల, మేడిపల్లి, కథలాపూర్, రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలోని వేములవాడ, బోయినపల్లి తదితర మండలాల పరిధిలోని 46 వేల ఎకరాలకు నీళ్లు అందిస్తున్నారు. ఉప కాలువలు పూర్తికాకపోవడంతో ప్రస్తుతం ఈ మండలాల పరిధిలోని 27 వేల ఎకరాలకే నీరు అందుతున్నది. ప్రస్తుతం ఎల్లంపల్లి ప్రాజెక్టులో 12 టీఎంసీల నీరు మాత్రమే ఉన్నది. ఈ నేపథ్యంలో గంగాధర, రామడుగు, బోయినపల్లి, కొడిమ్యాల మండలాల్లోని 7,500 ఎకరాలకే యాసంగికి నీళ్లందించే అవకాశం ఉందని నీటి పారుదల శాఖ అధికారులు పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణకు ధన్యవాదాలు..

నారాయణపూర్ రిజర్వాయర్ కింద పంటలు ఎండుతున్న విషయాన్ని వెలుగులోకి తెచ్చి, నీటి విడుదలకు కారణమైన నమస్తే తెలంగాణ దినపత్రికకు ఈ ప్రాంత రైతులు ధన్యవాదాలు తెలిపారు. 'నమస్తే' కథనం నారాయణపూర్, లక్ష్మీదేవిపల్లి తదితర గ్రామాల రైతులు రిజర్వాయర్ వద్దకు వచ్చి సోమవారం సాయంత్రం సంబురాలు చేసుకున్నారు. రెండు పంప్‌ల ద్వారా నీటిని విడుదల చేస్తే ఎండుతున్న పంటలను రక్షించుకునే అవకాశాలు ఉంటాయని నారాయణపూర్ రిజర్వాయర్‌ను పరిశీలించేందుకు వచ్చిన నీటిపారుదలశాఖ ఈఈ శ్రీనివాస్‌గుప్తా, డీఈలు శ్రీనివాస్‌లు, అలీంకు రైతులు విజ్ఞప్తి చేశారు.

నల్లగొండ జిల్లా అనుముల మండలం అలీనగర్ సమీపంలో కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై రైతులతో కలిసి ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, రైతు సంఘం నాయకులు

సాగర్ ఎడమ కాల్వకు నీటిని విడుదల చేయాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్
- కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై రైతులతో కలిసి రాస్తారోకో

హాలియా, జనవరి 29: నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ద్వారా నీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా అనుముల మండలం అలీనగర్ సమీపంలో సూరేపల్లి మేజర్ వద్ద కోదాడ-జడ్చర్ల 167వ జాతీయ రహదారిపై రైతులతో కలిసి సోమవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువులు, బోర్లను నమ్ముకొని ఎడమ కాల్వ కింద ఉన్న 30 శాతం మంది రైతులు వరి పంటను సాగు చేశారని తెలిపారు. రైతులు ఎకరానికి రూ.25 వేల వరకు పెట్టుబడి పెట్టారని చెప్పారు. చెరువులు, బావులు, కుంటలు పూర్తిగా ఎండిపోయి భూగర్భజలాలు అడుగంటిపోవడంతో నీళ్లు అందక పంట పొలాలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే తాగు, సాగునీటి కోసం సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదల చేసి చెరువులు, కుంటలను నింపి రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. గతంలో సాగర్ ప్రాజెక్టులో 505 అడుగుల నీరు ఉన్నప్పుడు కూడా రైతు సంఘాల ఒత్తిడి మేరకు నీటిని విడుదల చేశారని గుర్తుచేశారు. వారబందీ ప్రకారం నీటిని విడుదల చేసి రైతున్నను ఆదుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులను కలిసి వినతిపత్రం అందజేసినా ప్రభుత్వంలో కదలిక లేదని విమర్శించారు. నాగార్జునసాగర్‌లో సరిపడా నీటి నిల్వ లేకపోతే కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి ఆల్మట్టి నుంచి నీటిని తెచ్చి రైతాంగాన్ని ఆదుకోవాలని సూచించారు. లేదంటే రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, కూన్‌రెడ్డి నాగిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

త్వరలో నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్ పనులు

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు త్వరలో ప్రారంభిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినట్టు సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు సోమవారం సచివాలయంలో భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో సమావేశం అయ్యారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులపై సమీక్షించారు. అనంతరం వంశీచంద్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. పాలమూరు జిల్లాలో మక్తల్, నారాయణపేట, కొడంగల్ నియోజకవర్గాల్లో సాగునీరు అందించేందుకు 2014లోనే జీవో 69 తెచ్చారని తెలిపారు. అప్పటి ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి పట్టుదలతో నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు సాధించామని చెప్పారు. పదేండ్లుగా దానికి సంబంధించిన పనులు జరగలేదని విమర్శించారు. త్వరలో ప్రారంభిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసిందని వెల్లడించారు. కోయిల్ సాగర్ ప్రాజెక్టు సామర్థ్యం మరో రెండు టీఎంసీలు పెంచాలని మంత్రిని కోరినట్టు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, చిట్టెం పర్ణికరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నారాయణపూర్ పరిస్థితిపై కేసీఆర్ ఆరా

- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు ఫోన్
- రైతుల పక్షాన నిలబడాలని సూచన

కరీంనగర్, జనవరి 29 (నమస్తే తెలంగాణ : నారాయణపూర్ రిజర్వాయర్ పరిస్థితిపై బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు ఆరా తీశారు. నమస్తే తెలంగాణ దినపత్రికలో వచ్చిన కథనాన్ని చదివిన కేసీఆర్ కరీంనగర్ జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యపై చలించిపోయారు. సోమవారం మధ్యాహ్నం చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు ఫోన్‌చేసి అక్కడి రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యపై అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలోని గంగాధర, కొడిమ్యాల, మల్యాల మండలాల్లో పంటలు ఎండిపోతున్నాయని, తానే స్వయంగా వెళ్లి వాటిని పరిశీలించానని రవిశంకర్ చెప్పారు. అధికారులతో మాట్లాడారా? అన్న కేసీఆర్ ప్రశ్నకు ఎమ్మెల్యే బదులిస్తూ ఇప్పటికిప్పుడు నీళ్లు ఇచ్చే పరిస్థితి లేదని అధికారులు చెబుతున్నారని కేసీఆర్‌కు తెలిపారు. చొప్పదండి, వేములవాడ నియోజకవర్గాల్లో ఈ ప్రభావం పడుతున్నదని, 70-80 వేల ఎకరాలు నారాయణపూర్ రిజర్వాయర్‌పై ఆధారపడి ఉంటాయని రవిశంకర్ వివరించారు. స్పందించిన కేసీఆర్ రైతుల పక్షాన నిలబడి, వారికి నీళ్లు అందేలా చూడాలని సూచించారు. రవిశంకర్ మాట్లాడుతూ.. సార్ మీరు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అడగకుండానే అన్నీ ఇచ్చారని, నీళ్లు పుష్కలంగా ఉండేవని, రైతుబంధు సకాలంలో వచ్చేదని, ఎలాంటి బాధలు లేకుండా చూసుకున్నారని రైతులు చెప్పారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నీళ్లు లేవని, రైతుబంధు రావడం లేదని రైతులు చెప్తూ ఆవేదన వ్యక్తం చేశారని వివరించారు. అధికారులతో మాట్లాడి సకాలంలో నీళ్లు వచ్చేలా చూడాలని రవిశంకర్‌కు కేసీఆర్ సూచించారు.

కేసీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ల తొలగింపు!

- కొత్త డైరెక్టర్ల నియామకం కోసం త్వరలో నోటిఫికేషన్

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని రెండు డిస్కంలలోని డైరెక్టర్లంద